రమణ ఉత్తరం మడిచి ఇచ్చేశాడు. లాభం లేదు. ఈ మతిలేని ప్రొఫెసర్ మెదడుని సరిచెయ్యలేరు. పదిహేనేళ్ళ అమ్మాయిలు అభిమాన నటులకి వ్రాసినట్టు ఈయన ప్రైమ్మినిష్టర్ ఆఫ్ ఇండియాకి వ్రాస్తున్నాడు. పెర్వర్షన్ అంటే ఇదే కాబోలు.

* * * * * *

గోపాలకృష్ణ ఎక్ప్రొటే చేతిలో ఆ ఉత్తరం వుంది. దాన్ని చూసి అతడు చాలాసేపు నవ్వుకొన్నాడు. ప్రధానమంత్రికి చాలా రకాలయిన ఉత్తరాలు వస్తుంటాయి. కొన్ని తిడుతూ, కొన్ని దేశ సమస్యల గురించీ, కొన్ని పర్సనల్ ప్రాబ్లమ్సూ, అభ్యర్థనలూ- ఇలా అప్పుడప్పుడు ప్రేమలేఖలు కూడా.

కానీ ఇలాంటి ఉత్తరాలు రావటం మాత్రం చాలా తక్కువ.

అతడి ముందు 'రాక్'లు వున్నాయి. ఒకటి ఫస్టు సెక్రటరీకి వెళ్ళాల్సిన ఉత్తరాలు. వాటిలో కొన్ని ఏరి,ఫస్టు సెక్రటరీ ప్రధానమంత్రికి పంపుతాడు. రెండో రాక్లో తను జవాబు వ్రాయాల్సిన ఉత్తరాలు పడేస్తాడు. మూడో రాక్లో ఉత్తరాల మీద ఏ చర్యా తీసుకోవాల్సిన పని లేదు.

ప్రొఫెసర్ ఉత్తరం మూడో రాక్ చేరుకొంది.

మూడు 'రాక్స్'లోకి ఉత్తరాలు విడదీసిన తర్వాత మొత్తం మూడు ఫైళ్ళూ ప్రధానమంత్రికి వెళతాయి. ఫైలు మాత్రం ఆయన చూడదలుచుకుంటే పరిశీలించటానికే.

ఈ ఉత్తరాలు చూడటానికే ఆయన దినచర్యలో టైము ప్రొద్దున్న తొమ్మిది నుంచీ తొమ్మిదిన్నర వరకూ.

ఆగష్టు ఒకటో తారీఖు తొమ్మిదిన్నరకు ఆయనకి పార్టీ చీఫ్ అవినాష్తో అప్పాయింట్మెంటు వుంది. అంటే ఉత్తరాలు చూడటం పూర్తి అయ్యేక.

తొమ్మిదిన్నరవరకూ మామూలుగానే ఆయనే మొదటి ఫైలు నెట్టేసేడు.

అవినాష్ ఇంకా రాలేదు.

సాధారణంగా ప్రైమ్ మినిష్టర్ ప్రోగ్రాంలో రావాల్సిన వాళ్ళ ఆలస్యం ఉండదు. ఒకవేళ అలాంటిదేదయినా వుంటే, ఇంకో విజిటర్ని పంపటం జరుగుతుంది. ఈ చిన్న చిన్న విజిటర్లు రెండు మూడు నిమిషాల వ్యవధిలో తమ సంభాషణ ముగించాల్సి ఉంటుంది.

అయితే అవినాష్తో యీ చర్చ దాదాపు గంటసేపు జరగాల్సివుంది. ప్రతిపక్షం చాలా బలంగా వుంది. పార్టీ ఏ క్షణమైనా మెజారిటీ పోగొట్టుకొనేలా వుంది. అందుకే ఆ రోజు చాలా కీలకమైన చర్చ జరగబోతూ వుంది.

పార్టీ చీఫ్ ఇంకా రాలేదు.

తొమ్మిదీ ముప్పై అయిదు.

సాధారణంగా యిలాంటి పరిస్థితులు యేర్పడినప్పుడు, ప్రజల ఆసక్తిని పక్కకి మళ్ళించే

సంఘటనల్ని ప్రభుత్వం చేపట్టాలి. దాని గురించి చర్చించటానికే చీఫ్ వస్తున్నది.

తొమ్మిదీ నలభై.

ప్రధానమంత్రి విసుగ్గా రెండో ఫైలు ముందుకు లాక్కున్నాడు. సెకండ్ అసిస్టెంట్ ఆన్సర్ చెయ్యవలసిన ఉత్తరాలు, సావనీరుకి అభినందనలు పంపమనీ- ఫ్యాక్టరీ ప్రారంభోత్సవానికి రమ్మనీ- ఇలాంటివి.

ఫైలు పడేసి వెనక్కి వాలబోతూ, మూడో ఫైలు చూసేడు. ఓ కాగితం క్రిందికి జారి, చివర్లో పి.ఎస్. కనబడుతూంది. ప్రధానమంత్రికి పి.ఎస్.వ్రాసేదెవరా అని కుతూహలంతో ఉత్తరాన్ని బయటకి లాగేడు. ...."ఆ నక్షత్రానికి ఆకర్షణ శక్తి ఉన్నట్లయితే భూమ్మీది వస్తువులు దానికి వెళ్ళి అతుక్కుంటాయి-".

చాలాసేపు దానివైపే తదేకంగా చూస్తూ ఉండిపోయేడు ఆయన.

ప్రతి ఉత్తరానికీ చివర్లో పి.ఎస్.లు వ్రాసే మతిలేని ప్రొఫెసర్ అలవాటు, ఈ కథని ఇంకో మలుపు తిప్పటానికి ఉపయోగపడింది. చాలా విచారకరమైన మలుపు.

"ఇండియన్ టైమ్స్" అన్న దినపత్రిక ఆంధ్రదేశం నుంచి వెలుపడుతుంది. చాలా తక్కువకాలంలో ఇది ఎక్కవ అమ్మకాన్ని సాధించ గలిగింది. దానికి కారణం అది ప్రచురించే అతిశయోక్తులు. మామూలు విషయాన్ని కూడా అందంగా, చదివేవారికి కుతూహలం కలిగించేలా ప్రకటిస్తూ ఉంటుంది. నలుగురు చాకుల్లాంటి సబ్ ఎడిటర్లున్నారు. మిగతా దిన పత్రికలకి అందని విషయాల్ని కూడా సేకరించి వీళ్ళు ప్రచురిస్తూ ఉంటారు. వాళ్ళలో ఒకామె శైలజ.

రమణ ఆ రోజు మామూలుగా లంచ్ అవర్లో టీ తాగి వచ్చి, తన సీట్లో కూర్చొని పని చేసుకొంటున్నాడు.

అంతలో ప్యూన్ వచ్చి టైమ్స్ ఆఫీసులో ఎవరో అతడి గురించి వేచి ఉన్నారని చెప్పాడు.

సాధారణంగా పత్రికాఫీసుల్లో బయటవాళ్ళని లోపలికి రానివ్వరు. సెక్యూరిటీ దగ్గరే ఆపుచేసి, ఫోన్‌లో కావాల్సిన వాళ్ళని కనుక్కొని, అప్పుడు పంపిస్తారు పాస్ ఇచ్చి.

'వచ్చిందెవరూ' అని కనుక్కుంటే ప్రొఫెసర్.

"వెల్‌కమ్ టు మై ఆఫీస్" ఆనందంగా ఆహ్వానించేడు రమణ.

ప్రొఫెసర్ వచ్చి ఎదుటిసీట్లో కూర్చొని చుట్టూ చూసేడు. పెద్ద హాలు. ఎవరి పని వాళ్ళు తలవంచుకొని చేసుకుపోతున్నారు.

"టీ త్రాగుతారా?" అడిగేడు రమణ.

"టీ కాదు ముఖ్యం. నీతో ఓ విషయం చెప్పటానికి వచ్చేను".

"ఏమిటి?".

"మనం సాయంత్రం ఫ్లయిట్‌లో ఢిల్లీ వెళుతున్నాం".

* * * * * *

శైలజకి జ్ఞాపశక్తి ఎక్కువ. చాలా సంవత్సరాల తర్వాత చూసిన విషయాల్ని కూడా జ్ఞాపకం పెట్టుకోగలదు. అందుకే ప్రొఫెసర్‌ని గుర్తు పట్టింది.

అతడీ ఆఫీసుకు ఎందుకొచ్చినట్లు?.

రమణ ముందు కుర్చీలో కూర్చోవటం చూసి ఆమె అక్కడికి వచ్చింది. అక్కడికి ఆమె చేరుకొనే సమయానికి రమణా, ఆయనా ఘర్షణ పడుతున్నారు. శెలవు దొరకదంటున్నాడు రమణ. ఎలాగయినా వీలు చూసుకొమ్మనీ, తనకి అక్కడ అసలేమీ తెలియదనీ ప్రొఫెసరంటున్నాడు.

"హల్లో!" అంటూ చేరుకున్నది ఆమె అక్కడికి. "మీరు ఆనంద మార్గం కదూ?" కుర్చీలో కూర్చొంటూ అడిగింది.

"కాదు, అయోమయం" అన్నాడు ప్రొఫెసర్.

ఆమె నవ్వి "సరే, మీ మతిమరుపు చూస్తుంటేనే తెలుస్తోంది. మీరు ప్రొఫెసర్ ఎ.యమ్.ఎ.యమ్. అని" అంది.

"మీకు తెలుసా?" రమణ అడిగేడు.

"చాలాకాలం క్రితం పేపర్లో ఫోటో చూసేను".

"నీ జ్ఞాపకశక్తి మెచ్చుకోదగిందమ్మాయ్" అన్నాడు ప్రొఫెసర్.

"ఇలా వచ్చారేమిటి?".

వచ్చిన పని చెప్పేడు ప్రొఫెసర్.

"నాకు శెలవు దొరకదు. చేరి నాలుగు రోజులు కాలేదు, అప్పుడే శలవంటే ఇంటికి పంపిస్తారు" అన్నాడు రమణ.

"ఎందుకు ఢిల్లీ?" అడిగింది శైలజ.

"ప్రధానమంత్రి స్వయంగా రమ్మన్నారు....".

అప్పటి వరకూ కుర్చీలో వెనక్కిరాలి, కబుర్లు చెబుతూన్నదల్లా ఈ మాటతో నిటారుగా అయి "ప్రధాన మంత్రా?" అంది.

ప్రొఫెసర్ ఉత్తరం చూపించేడు.

దాంతో ఆమెకు కుతూహలం పెరిగింది. "అసలు విషయం ఏమిటి? మొత్తం అంతా వివరంగా చెప్పండి" అంది.

నక్షత్రం గురించీ- అది భూమి పై రావటం గురించీ అంతా చెప్పేను. ఒక క్షణం ఆమె మౌనంగా ఆలోచిస్తూ ఉండిపోయింది.

తరువాత, "ఒక షరతు మీద రమణకి లీవు ఇస్తాం" అంది.

"ఏమిటి?".

"ఈ విషయాన్ని ఢిల్లీలో ఏ పత్రికక్కీ మీరు ముందు వెల్లడి చెయ్యకూడదు".

"సరే దానికేముంది" అన్నాడు ప్రొఫెసర్.

"ఒకవేళ వెల్లడి చేసినా ఎవరూ నమ్మరు. అసలు నేను వ్రాసిన ఓ పిచ్చి ఉత్తరానికి అంత ప్రాముఖ్యత రావటమే నాకు ఆశ్చర్యంగా ఉంది. నావన్నీ కాకుల లెక్కలు" అన్నాడు. ఆమె నవ్వి "మాకు కావలసినవి అలాటి వార్తలే. లోకులు కాకులు" అంది.

ఆ సాయంత్రం బోయింగ్‌లో ప్రొఫెసర్, రమణ ఢిల్లీ వెళ్ళారు.

* * * * * *

ఆ మరుసటిరోజు ఇండియన్ టైమ్స్ పత్రికలో ఒక మూల బాక్సు కట్టి ఒక వార్త పడింది ఇలా.

ఆగష్టు నాలుగు, అంతరిక్షం.

భూమిమీద సకల చరాచరాలు నాశనం కాబోతున్నాయా? ప్రొఫెసర్ ఆనందమార్గం అంచనా నిజమయ్యే పక్షంలో ఆ రోజు ఎంతో దూరంలో లేదు. ప్రాక్సిమా సెంక్చువరీ అనే నక్షత్రం భూమికి దగ్గరగా దూసుకువస్తోంది. కొన్ని వేలకోట్ల మైళ్ళ వేగంతో వస్తున్న యీ నక్షత్రం భూమి యొక్క పరిధిలోకి ఆగష్టు పదిహేడు ప్రొద్దున్న పదకొండు గంటల పది నిమిషాలకి ప్రవేశించి, మూడు సెకన్ల కాలం పాటు వుండి అనంతవిశ్వంలోకి వెళ్ళిపోతుంది. అయితే భూమిలో వుండే పదార్థాలన్నీ పోటీ పడి ఆ నక్షత్రాన్ని చేరుకోవటానికి తొందరపడడంలో భూమి పేలిపోతుంది. కాగితంలో పకోడీలు దట్టంగా కూరినొక్కితే పేలినట్టు భూమి పేలిపోతుందా? పదిహేడో తారీఖు వరకూ వేచి చూద్దాం. ప్రొఫెసర్ మాటలేగానీ యదార్థమైతే ఆ తర్వాత చూడటానికి మనం ఎలానూ వుండముగా.

- మా విలేఖరి.

ఇండియన్ టైమ్స్ పత్రిక అతితొందర్లోనే పైకి రావటం చూసి ఓర్వలేని మరో దినపత్రిక మధ్యాహ్నం ఎడిషన్ ఇలా ప్రకటించింది.

"ఒక ప్రముఖ దినపత్రిక ప్రకటించిన అసత్యవార్త వల్ల నగరంలో అలజడి. 'ప్రళయం వస్తుంది' అని పత్రిక ప్రకటించడం వల్ల ప్రజలు భయకంపితులవుతున్నారు. గుండె జబ్బు వున్న వాళ్ళ పరిస్థితి మరింత ప్రమాదకరమయింది. ఈ వార్త మూలన తన ఆరోగ్యం దెబ్బతిన్నదనీ, దానికి నష్టపరిహారంగా యాభై వేల రూపాయలకి దావా వెయ్యబోతున్నాననీ హైకోర్టు న్యాయవాది ఒకరు ప్రకటించారు".

ఈ వార్త చూసి, ఇండియన్ టైమ్స్ ఎడిటర్ కంగారు పడ్డాడు. అవసరమైన చిక్కుల్లో

యిరుక్కోవటం యిష్టంలేదు. శైలజని చీవాట్లు పెట్టేడు.

మనిషి మనుగడమీద జూదం మొదలయింది.

* * * * * *

ఆగష్టు నాలుగు- ఢిల్లీ

పదకొండు గంటలకి అప్పాయింట్‌మెంట్.

తొమ్మిది గంటలకి సెక్రటేరియట్‌కి చేరుకున్నారు యిద్దరూ. రమణ గుండె వేగంగా కొట్టూకొంటోంది. ప్రధాన మంత్రితో తను స్వయంగా మాట్లాడబోతున్నాడు. కలలో కూడా వూహించలేని విషయం అది.

పావుతక్కువ పదింటికి అప్పాయింట్‌మెంట్ ఆర్డర్ వెరిఫికేషన్ జరిగింది. ప్రోగ్రామ్ షీట్‌లో పేరు వ్రాయబడింది.

పావు తక్కువ పదకొండుకి విజిటర్స్ ఛాంబర్‌లోకి ప్రవేశం లభించింది. ఆ ఛాంబర్‌లోకి వెళ్ళాలంటే కారిడార్‌లోంచి నడవాలి- అక్కడే విజిటర్లు యేమయినా ఆయుధాలు ధరించిందీ లేనిదీ పరీక్ష జరుగుతుంది.